క్లుప్తంగా

విద్యార్థికి ఏపీ మంత్రి సత్కారం



ప్రిన్స్‌ను సత్కరిస్తున్న మంత్రి వేణుగోపాల్‌కృష్ణ

ఖమ్మం మామిళ్లగూడెం: పదికి పైగా లఘు చిత్రాల్లో నటించడమే కాక పలు లఘుచిత్రాలు నిర్మించిన ఖమ్మంలోని తెలంగాణ నారాయణ స్కూల్ పదో తరగతి విద్యార్థి పగిడిపల్లి ప్రిన్స్‌ను ఏపీ మంత్రి వేణుగోపాల్ కృష్ణ సత్కరించారు. రాజమండ్రిలో జరిగిన అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవంలో విద్యార్థిని సత్కరించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

ఎంపీకి మాజీ మంత్రి శుభాకాంక్షలు



వద్దిరాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: రాజ్యసభ ఎన్నికల్లో తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్రను మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వద్దిరాజును హైదరాబాద్‌లోని తన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం మేరకు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికై పెద్దల సభకు వెళ్లడం శుభపరిణామం అన్నారు.

డ్రెయిన్ పూడికతీత పనుల పరిశీలన

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 41వ డివిజన్ కవిరాజ్‌నగర్ రోడ్ నంబర్ 6 నుంచి సీక్వెల్ రోడ్ మినీ ట్యాంక్‌బండ్ ఏరియాలో మేజర్ బాక్స్ డ్రెయిన్ పూడికతీత పనులను మేయర్ పునుకొల్లు నీరజ కార్పొరేటర్ కర్నాటి కృష్ణతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ వేసవిలో డ్రెయిన్‌లో పేరుకున్న పూడికతో పాటు వ్యర్థాలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. వర్షాకాలంలో నీరు నిల్వకుండా మురుగును తొలగించి, బయటకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జవాన్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాన్ని వినియోగించుకోవాలి

కామేపల్లి: డీసీసీబీ బ్రాంచ్ పరిధిలోని రైతులు ప్రధానమంత్రి జీవన జ్యోతి, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కామేపల్లి డీసీసీబీ మేనేజర్ శ్రీవాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు రుణాల వాయిదా చెల్లింపులను సకాలంలో చెల్లిస్తే అదనపు వడ్డీ భారం లేకుండా ఉంటుందని సూచించారు.

కార్యదర్శుల మండల అధ్యక్షుడిగా నెహ్రూ



గుగులోత్ నెహ్రూ

కామేపల్లి: కామేపల్లి మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కొమ్మినేపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి గుగులోత్ నెహ్రూ, జనరల్ సెక్రటరీగా కామేపల్లి కార్యదర్శి పెండ్ర అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా బానో త్ రవికుమార్, మహిళా అధ్యక్షురాలిగా అనురాధ, కోశాధికారిగా మోహన్ నియమితులయ్యారు. ఎన్నికైన నూతన కమిటీని ఎంపీడీఓ రవీందర్, యూడీసీ సాంబశివరావు అభినందించారు.

క్రికెట్ జట్టుకు జెర్సీలు అందజేత

ఖమ్మంలీగల్: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో గురువారం సాయంత్రం జరగనున్న న్యాయవాదుల క్రికెట్ జట్టుకు కొండపల్లి శ్రీనివాస్ స్పాన్సర్ చేసిన జెర్సీలను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు అందజేశారు. ఖమ్మం రెవెన్యూ జట్టుతో ఈ మ్యాచ్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. జాయింట్ సెక్రటరీ ఎ.విజయ రాఘవ, క్రీడల కార్యదర్శి ఆర్. వెంకట్, న్యాయవాదులు కొండపల్లి శ్రీనివాస్, గద్దల దిలీప్, వరుణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడి మృతి

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఎం జిల్లా నాయకుడు మాటూరు రాంచంద్రరావు బుధవారం ఖమ్మంలోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. రాంచంద్రరావు మృతి పట్ల సీపీఎం, సీఐటీయూ నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

నామ్‌కే.. వాస్తే!





పాతలింగాల గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు (ఇన్‌సెట్) బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకం

శంకుస్థాపనకే పరిమితమైన జాస్తిపల్లి-పాతలింగాల రోడ్డు

- నిలిచిపోయిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు
- ఏళ్లుగా ఎదురుచూస్తున్న గ్రామస్తులు
- రూ.3 కోట్ల నిధులు మంజూరైనా పనుల్లో జాప్యం
- ఏడాది కావొస్తున్నా పురోగతి శూన్యం

కామేపల్లి: ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రోడ్డు నిర్మాణ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించిందని భావించిన ఆ గ్రామస్తుల కల కలగానే మిగిలిపోయింది. మట్టి రోడ్డు కాస్త బీటీ రోడ్డుగా మారనుందని, ఇకపై రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని ఆశ పడిన ప్రజలకు నిరాశే మిగిలింది. వారి ఆశ నెరవేరాలంటే ఇంకా సమయం పట్టే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది.

రూ.3 కోట్ల నిధులు మంజూరు..

జాస్తిపల్లి నుంచి పాతలింగాల గ్రామం వరకు సుమారు 3 కిలోమీటర్ల ఉన్న మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా వేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం డీఎంఎఫ్‌టీ నిధులు కింద రూ.3 కోట్లు మంజూరు చేసింది. అప్పటి మంత్రిగా ఉన్న పువ్వాడ అజయ్‌కుమార్ గత ఏడాది మేలో శంకుస్థాపన చేయగా.. నాటి నుంచి నేటి వరకు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించలేదు. దీంతో రోడ్డు నిర్మాణ పనులు కేవలం శంకుస్థాపనకే పరిమితమైందని గ్రామస్తులు మండిపడుతున్నారు. శంకుస్థాపన చేసి ఏడాది కావొస్తున్నా పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం చేస్తున్న కాంట్రాక్టర్‌పై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీరాజ్ అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకుని బీటీ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలని పాతలింగాల గ్రామస్తులు కోరుతున్నారు.

పనులు వెంటనే చేపట్టాలి..



బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి ఏడాది కావొస్తుంది. రోడ్డు పడితే రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉంటుందని సంతోషపడ్డాం. ఇప్పుడు పనులు చేపట్టకుంటే మళ్లీ వర్షాకాలంలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణ పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలి.

– మడ్డి వేణుబాబు, పాతలింగాల

అగ్రిమెంట్ పూర్తి కాలేదు..

పాతలింగాల గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరైనవి కానీ అగ్రిమెంట్ కాకపోవడంతో ఇంకా పనులు ప్రారంభించలేదు. త్వరలోనే పనులు ప్రారంభించి బీటీ రోడ్డు పూర్తి చేస్తాం.

– వాసు, పీఆర్ ఏఈ, కామేపల్లి

మాదిగల జోడోయాత్ర పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి

ఖమ్మం మామిళ్లగూడెం: మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి ఆధ్వర్యాన తాజాగా చేట్టిన మాదిగల జోడోయాత్ర వాల్ పోస్టర్లను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పిడమర్తి కలిసి యాత్ర గురించి వివరించారు. 2014లో బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పి నేటికీ అమలు చేయలేదన్నారు. మళ్లీ కమిటీ వేసి కాలయాపన చేసే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. కేంద్రం మాదిగలను విస్మరిస్తుందని, మాదిగ జాతిని మేల్కొపేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఈయాత్ర కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదిగ రాజకీయ వేదిక చైర్మన్ ఒక్కలగడ్డ సోమచంద్రశేఖర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

‘జేవీఆర్’లో ఫేర్‌వెల్ డే

కూసుమంచి: కూసుమంచిలోని జలగం వెంగళరావు జూనియర్ కళాశాలలో బుధవారం ఫేర్‌వెల్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూసుమంచి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆర్. వీరస్వామి, ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, కళాశాల ప్రెసిడెంట్ రమేశ్, ప్రిన్సిపాల్ శేఖర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఇంటర్‌లోనే తమ భవిషత్‌ను నిర్ణయించుకోవాలన్నారు. గ్రామీణప్రాంతమైన కూసుమంచిలో కార్పొరేట్‌కు దీటుగా విద్యను అందిస్తున్న కళాశాల యాజమాన్యాన్ని వక్తలు అభినందించారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు.

ముగిసిన శిక్షణ తరగతులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో నిర్వహిస్తున్న స్త్రీ సాధికారత శిక్షణ తరగతులు బుధవారంతో ముగిసినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. టాస్క్, మహీంద్ర సంయుక్తంగా శిక్షణ తరగతులు నిర్వహించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు శ్రీనివాసరావు, శివప్రసాద్, రవీంద్రబాబు, ప్రవీణ్‌కుమార్, ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, ఆయా కంపెనీలు బాధ్యులు పాల్గొన్నారు.

‘కేజీబీవీ’ని తనిఖీ చేసిన తహసీల్దార్

కామేపల్లి: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం కామేపల్లి తహసీల్దార్ సుధాకర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతం, రికార్డులు, వంట రూమ్‌లను పరిశీలించి బియ్యం, పప్పు ఇతర స్టాక్ వివరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, ప్రగతిని గమనించి మాట్లాడుతూ.. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేపట్టాలన్నారు. మెనూ అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకుని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. గిర్దావర్ సక్రు, స్వాతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విప్లవ పార్టీల ఐక్యతే ధ్యేయం



మాట్లాడుతున్న రాంచందర్

తిరుమలాయపాలెం: విప్లవ పార్టీల ఐక్యతే తమ ధ్యేయమని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేజీ రాంచందర్, కెచ్చల రంగారెడ్డి అన్నారు. వచ్చే నెల 3, 4, 5వ తేదీల్లో ఖమ్మంలో నిర్వహించే సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ యూనిటీ మహాసభలను జయప్రదం చేయాలని పిండిప్రోలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు తెలిపారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, పీసీసీ సీపీఎంఎల్, సీపీఎంఎల్‌ఆర్‌ఐ పార్టీలు ఏకమై ఒక బలమైన విప్లవ కమ్యూనిస్టు పార్టీగా ఏర్పడడానికి స్వాగతిస్తున్నామని, 16 రాష్ట్రాల నుంచి 300 మందిపైగా ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. మోదీ ప్రభుత్వం రాష్ట్రాలకు సంక్రమించిన ఫెడరల్ హక్కులను కాలరాస్తూ.. పార్లమెంటరీ సంస్థలైన సీబీఐ ఈడీ తదితర సంస్థల ద్వారా దాడులు చేయిస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు రాయల చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు నాయకులు కే రమా, బందెల వెంకయ్య, చిన్న చంద్రన్న, కమ్మ కోమటి నాగేశ్వరరావు, సూర్యం, సోమనపల్లి వెంకటేశ్వర్లు, తిమ్మిడి హనుమంతరావు, ఎడ్లపల్లి నవీన్, వెంకటస్వామి, గోకినపల్లి సరోజినీ తదితరులు పాల్గొన్నారు.

‘న్యూ ఇరా’ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న యాజమాన్యం

ఖమ్మం సహకారనగర్: ఇటీవల విజయవాడలో విజయమాధవి సేవా సాంస్కృతిక అకాడమీ నిర్వహించిన నేషనల్ లెవల్ డ్యాన్స్ ఫెస్టివల్‌లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని న్యూఇరా పాఠశాల చైర్మన్ ఐ.వీ.రమణారావు, డైరెక్టర్ పి.భూమేశ్వరావులు తెలిపారు. బుధవారం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించిన సందర్భంగా వారు మాట్లాడారు. వి.భవిష్యవర్ధిని, ఎస్.జయని, రుచిక, లక్ష్మిలు కూచిపుడిలో ప్రతిభ కనబర్చి నాట్యమయూరి అవార్డు అందుకున్నట్లు పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ



గుర్తింపు కార్డు అందజేస్తున్న నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ఆటో డ్రైవర్లకు ఏఐటీయూసీ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. బుధవారం మమత అడ్డాలోని ఆటో కార్మికులకు సీపీఐ సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు గుర్తింపు కార్డులను అందజేసి మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు క్రమశిక్షణతో మెలగాలని, ప్రయాణికుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, క్లైమెంట్, ఏనుగు గాంధీ, ఆటో కార్మికులు ఆముదాల వెంకన్న, ఉపేందర్, సందీప్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసుడికి ప్రబంధ సేవ



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కూసుమంచి: జీళ్లచెరువులోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం ప్రభోదిక ఆరగింపు, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం నిర్వహించగా.. మధ్యాహ్నం ప్రబంధ సేవాకాలం, గోష్ఠి, రాత్రి శ్రీనమ్మాళ్వార్ల పరమపదోత్సవ కార్యక్రమాలను యాజ్ఞికులు వెలగలేటి రామానుజాచార్యులు, సహాయకులు చిలకమర్రి స్వామినాథ్ ఆచార్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బూర్లె వీరబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఇరుముడి

నేలకొండపల్లి: శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తల్లి మాలధారణ భక్తుల ఇరుముడి కార్యక్రమం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. మండలంలోని మంగాపురంతండాలో 41 రోజుల పాటు దీక్షను పూర్తి చేసి ఏపీలోని పెనుగ్రంచిప్రోలులో ఇరుముడి చెల్లించేందుకు బయలుదేరనుండగా.. ప్రత్యేక పూజలు నిర్వహించి ఆట,పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మాలధారణ భక్తులు నెహ్రూ, గిరి, గోపి, రాజా, ఉపేందర్, అర్జున్, రాజశేఖర్, వెంకటస్వామి, రఘు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

కామేపల్లి: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ 285వ జయంతి వేడుకలను ఈ నెల 24న మండల కేంద్రంలోని రైతువేదిక ముందు నిర్వహించనున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఈ మేరకు తహసీల్దార్ సుధాకర్ చేతుల మీదుగా జయంతి వేడుకల పోస్టర్లను ఆవిష్కరించారు. గిరిజన ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత అందరూ పాల్గొన్ని జయపద్రం చేయాలని కోరారు.

బీసీ నాయకుడికి మద్దతు పలకాలి..

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీ నాయకుడు డాక్టర్ గోంగుర వెంకటేశ్వర్లు(జీ.వీ.)కి మద్దతు పలకాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలకు పిలుపునిచ్చారు. ఖమ్మం అంబేడ్కర్‌భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ఖమ్మం అభ్యర్థిగా డాక్టర్ జీ.వీ. టికెట్ ఆశిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జీ.వీ. మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం గత 30 ఏళ్లుగా మంద కృష్ణ పోరాటం చేస్తున్నారని, ప్రధాని మోదీ ఇచ్చిన హామీ కచ్చితంగా అమలవుతుందని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కూరపాటి అనిల్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు అంజి మాదిగ, మాచెర్ల క్రాంతి, బచ్చలికూర వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

కేసు నమోదు

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు పెట్రోల్ బంక్ సమీపాన ఓ వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి పాల్పడగా బుధవారం కేసు నమోదైంది. పిండిప్రోలుకు చెందిన పాలవాయి యుగంధర్ టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి ఆయనపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత



ఖమ్మం అర్బన్ : ధంసలాపురంలో సమ్మక్క జాతరను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల



ఖమ్మం మయూరి సెంటర్: మంత్రిని సత్కరిస్తున్న నరేశ్ తదితరులు

- త్వరలోనే పార్టీ మండల, గ్రామ నూతన కమిటీలు
- ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి తుమ్మల

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండల అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మండలంలోని చింతగుర్తిలో కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం మాజీ సర్పంచ్ తమ్మిని నాగేశ్వరరావు ఆధ్వర్యాన బుధవారం నిర్వహించి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రత్యర్థులు ప్రలోభాలకు గురిచేసినా తన గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని, కష్టపడే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని చెప్పారు. త్వరలోనే గ్రామ, మండల స్థాయిలో కాంగ్రెస్ నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. అనంతరం గ్రామాల వారీగా నాయకులు తాగునీరు, విద్యుత్, రహదారుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా, ఖమ్మం నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జావిద్, కార్పొరేటర్లు మలీదు జగన్, గుత్తా వెంకటేశ్వరరావుతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు మానుకొండ రాధాకిషోర్, మాలోత్ లక్ష్మి, హన్మంతరావు, దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, లెమ్మల రమేష్, వాంకుడోత్ దీపక్, గుడిపూడి రామారావు, బండి నాగేశ్వరరావు, గాజుల రమేష్, బండి వెంకన్న, దేవ్‌సింగ్, బాతుల రమణీసుధాకర్, పూర్ణచందర్‌రావు, కరుణాకర్‌రెడ్డి, కొత్త కొనుదయ్య, సూదగాని గోపయ్య, కిలారు వెంకటరమణ, కుతుంబాక సీతారాం, కిలారు రామారావు, తేజావత్ రామ్మూర్తినాయక్, సిద్దయ్య, బుచ్చిబాబు పాల్గొన్నారు.

◆ ఖమ్మంఅర్బన్: ఖమ్మం ధంసలాపురం ఆర్‌ఓబీ పక్కన సమ్మక్క – సారలమ్మ గద్దెల వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు చేసి జాతరను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో బ్రహ్మరెడ్డి, తుపాకుల యలగొండస్వామి, జాతర నిర్వాహకులు పాల్గొన్నారు.

◆ ఖమ్మంమయూరిసెంటర్: కమ్మ మహాజన సంఘ నాయకులు మందటి నరేశ్‌చౌదరి మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సత్కరించారు. బుధవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నరేష్ నివాసానికి వెళ్లగా వారు సత్కరించి మాట్లాడారు.

◆ ఖమ్మం సహకారనగర్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో పీఆర్‌టీయూ తెలంగాణ ఆధ్వర్యాన రూపొందించిన క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తొలుత జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మట్టా శ్రీనివాసరావు, కొమ్మినేని అనిల్‌కుమార్, నాయకులు చావా శ్రీదేవి, ఉపేందర్, సామినేని మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో గురువారం నుంచి ఖమ్మం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు జరగనుండగా, టీ షర్ట్స్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం స్టేడియంలో పరిశీలించిన మంత్రి వివరాలు తెలుసుకున్నారు. స్టేడియం అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డితో పాటు సాధు రమేష్‌రెడ్డి, డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, మిక్కిలేని నరేంద్రచౌదరి, ఎం.డీ.ముస్తఫా, కమర్తపు మురళి, చావా నారాయణరావు, ఓలేటి సాంబమూర్తి, మతిన్ పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న తహసీల్దార్ గౌరీశంకర్

నేలకొండపల్లి: ఎన్నికల విధుల పట్ల అప్రమతంగా ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని తహసీల్దార్ డి.గౌరీశంకర్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బీఎల్‌ఓలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికలల్లో ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు పట్ల జాగ్రత్తలు వహించాలని సూచించారు. అదేవిధంగా ఎంపీడీఓ ఎం.యర్రయ్య మాట్లాడుతూ.. మండలంలో ఉపాధి హామీ పథకం పనులను కూలీలు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. నర్సరీలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, ఈజీఎస్ ఏపీఓ సునీత, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ రావు, ఈసీ శేషగిరిరావు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

రైతులపై నిర్బంధాన్ని ఆపాలి

ఖమ్మంమయూరిసెంటర్: దేశంలో రైతులు సాగు చేసే పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు మేరకు మద్దతు ధరలు నిర్ణయం చేయాలని, ఢిల్లీ సరిహద్దుల్లో రైతులపై నిర్బంధం ఆపాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీపీఎం ఆధ్వర్యాన ఖమ్మంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రెండో దశ ఉద్యమం చేస్తున్న పంజాబ్, హర్యానా రైతులను సరిహద్దుల్లో నిలువరించి విదేశీ ఉగ్రవాదులపై ప్రయోగించే ఆధునిక పద్ధతుల్లో దాడులు చేయడం భారత సమాజం ఖండించాలని,స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బుగ్గవీటి సరళ, భారతి, చింతలచెరువు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా ‘ఉపాధి’ ఓపెన్ ఫోరం



ఓపెన్ ఫోరంలో పాల్గొన్న అధికారులు

ఖమ్మంరూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనుల్లో భాగంగా బుధవారం జరిగిన ఓపెన్ ఫోరం తూతూ మంత్రంగా సాగింది. ఈ సమావేశానికి సంబంధిత అధికారులు లేకుండానే హాజరైన అధికారులు ప్రారంభించారు. తెల్దారుపల్లిలో నేషనల్ హైవే రోడ్డు పోతుందని తెలిసినా.. సంబంధిత అధికారులు అదే భూమిలో ఉపాధి హామీలో మొక్కలు ఎందుకు నాటారని? ఇప్పుడు మొక్కలు లేకుండా పోయాయయని, దీంతో రూ.లక్షలు వృథా అయ్యాయని గ్రామస్తులు అధికారులపై మండిపడ్డారు. చాలా గ్రామాల్లో పనులకు రాకున్నా వచ్చినట్లుగా మస్టర్‌లో హాజరు వేసుకొని కూలీ డబ్బులు డ్రా చేసుకుంటున్నా.. సంబంధిత అధికారులు ఎవరూ కూడా అటు వైపు కన్నెత్తి కూడా చూడలేదని ఆయా గ్రామాలకు చెందిన వారు తెలిపారు. ఇదిలాఉండగా సమావేశంలో ఎంపీపీ, జెడ్పీటీసీలు సమయపాలన పాటించకపోవడంతో చర్చనీయాంశంగా మారింది. ఏపీడీ చుంచు శ్రీనివాసరావు, ఏపీఓ శ్రీదేవి, ఏవీఓ పవన్, కార్యదర్శులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని త్రీటౌన్ భక్తపోతన వీధిలో నివసిస్తున్న పేద వృద్ధురాలు వేములపల్లి రాజేశ్వరికి బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ప్రతినిధులు నిత్యావసరాలను అందించారు. రాజేశ్వరి భర్త చనిపోవడం, కొడుకు, కూతురు మానసిక వికలాంగులు కావడాన్ని లయన్స్ క్లబ్ ప్రతినిధులు గుర్తించి రూ.10 వేల విలువైన మూడు నెలలకు సరిపడా బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను అందించారు. క్లబ్ అధ్యక్షుడు టి.కృష్ణారెడ్డి, కార్యదర్శి వి.హనుమంతరావు, జన్ చైర్మన్ డాక్టర్ డీపీసీ రావు, అత్తులూరి గోవర్ధన్, అవోపా కృష్ణమూర్తి, మేకా దుర్గా నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, దుర్గారావు, రాజేశ్వరి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి



తిరుమలాయపాలెం: ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: మార్కులు తగ్గాయంటూ విద్యార్థులను చితకబాదిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్ డిమాండ్ చేశారు. తిరుమలాయపాలెం మండలం మాదిరిపురం గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థులను తెలుగు ఉపాధ్యాయుడు కొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. బుధవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.మార్కులు తగ్గాయని విద్యార్థులను కొట్టడం సరికాదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు శ్రీకాంత్, పృథ్వి, విష్ణు, నాగుల్ మీరా, వాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల ఆందోళన..

తిరుమలాయపాలెం: విద్యార్థులపై దాడికి పాల్పడిన ఘటనపై వామ పక్ష విద్యార్థి సంఘాలు బుధవారం గురుకుల పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘాల జిల్లా కార్యదర్శులు మస్తాన్, ప్రవీణ్, రామకృష్ణ, పీవైఎల్ జిల్లా కార్యదర్శి గొర్రెపాటి రమేశ్, నాయకులు బేతంపూడి నాగరాజు, షబ్బీర్, శంకర్ పాల్గొన్నారు.